సాక్షి
ఆదిలాబాద్

మంగళవారం : 15 : ఆగస్టు : 2023

సైనికుడా.. వందనం



దేశ రక్షణలో సైనికుల పాత్ర కీలకం. కుటుంబాలను వదిలి బార్డర్‌లో అనునిత్యం అప్రమత్తంగా ఉండే వీర జవాన్‌కు సెల్యూట్ చేయాల్సిందే. పంద్రాగస్టు సందర్భంగా ఉమ్మడి జిల్లాలో పలువురి సైనికులపై కథనం.

IIలో▸



ఏజెన్సీ టు ఎర్రకోటకు IIలో▸

ఢిల్లీలోని ఎర్రకోట వద్ద నిర్వహించే పంద్రాగస్టు వేడుకలకు గుండాల గొండుగూడ గ్రామానికి చెందిన జుగ్నాక గణపతిరావు, కమల దంపతులకు ఆహ్వానం అందింది.

గరిష్టం/కనిష్టం
32.0/24.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పల్లెప్రగతిపై దృష్టి సారించాలి



తాడిహత్నూర్‌లో పల్లెప్రకృతి వనం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా

నార్నూర్: పల్లెప్రగతి పనులపై దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా అన్నారు. మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో పల్లె ప్రకృతివనం, నర్సరీతో పాటు శ్మశానవాటికను సోమవారం పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నీతి అయోగ్ కింద నార్నూర్ మండలం ఎంపికైందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై అందరూ దృష్టి సారించాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో రమేశ్, ఎంఈవో అశన్న, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

తాంసి: పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అభివృద్ధి, పారిశుద్ధ్య పనులకు సంబంధించిన రికార్డులను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా అన్నారు. జేపీఎస్‌ల క్రమబద్ధీకరణలో భాగంగా భీంపూర్ మండల కేంద్రంలో మండలంలోని ఆయా గ్రామాలకు సంబంధించిన జేపీఎస్‌ల పనితీరు రికార్డులను సోమవారం పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. వారి వెంట డీఎల్పీవోలు ధర్మరాణి, భిక్షపతిగౌడ్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో వినోద్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పల్లె దవాఖానాల్లో అన్ని రకాల వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. ఈనెల 16 నుంచి నిర్వహించనున్న కుష్ఠు సర్వేలో భాగంగా ఫీవర్, టీబీ కేసుల గుర్తింపుతో పాటు గర్భిణులు, బాలింతల వివరాలు సేకరించాలన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న వారిని ముందుగానే గుర్తించి ఆస్పత్రికి తరలించాలని, అలాంటి వారిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చొరవ చూపాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు విజయసారధి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనుల పోరాట ఫలితంగానే స్వాతంత్య్రం



జాతీయ జెండాలను పంపిణీ చేస్తున్న శంకర్

ఆదిలాబాద్: ఎందరో త్యాగధనుల ఫలితంగానే దేశానికి స్వాతంత్య్రం సిద్ధించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని కోలీపుర కాలనీలో ఇంటింటికీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్య్ర సమరయోధుల పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజున ప్రతీ భారతీయుడు తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు.

సమరయోధులను స్మరించుకోవాలి



విద్యార్థులతో కలిసి ఫొటోలను తిలకిస్తున్న చైర్మన్ జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్: స్వాతంత్య్ర సమరయోధులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో స్వాతంత్య్ర సమరయోధుల ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి సమరయోధుల ఫొటోలను తిలకించారు.

‘హస్త’వ్యస్తం..!



నినాదాలు చేస్తున్న కంది వర్గీయులు

- రసాభాసగా కాంగ్రెస్ బీసీ ఐక్యవేదిక సభ
- వీహెచ్ సమక్షంలో ఇరువర్గాల తోపులాట
- అరుపులు, కేకలతో గందరగోళ పరిస్థితి
- సభ నుంచి బయటకు వెళ్లిన వీహెచ్
- ‘కంది’ని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ డీసీసీ అధ్యక్షుడి ప్రకటన

కైలాస్‌నగర్: కాంగ్రెస్‌లో వర్గపోరు తీవ్రస్థాయికి చేరింది. జిల్లాలో హస్తం పార్టీలో ఇప్పటి వరకు అంతర్గతంగా ఉన్న విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. దీంతో లొల్లి రచ్చకెక్కింది. పట్టణంలోని విద్యుత్ తరంగిణి భవన్‌లో సోమవారం నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీసీ ఐక్యవేదిక సభ రసాభాసగా మారడమే ఇందుకు నిదర్శనం. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంత్‌రావు సమక్షంలో పార్టీ ఇరువర్గాల నాయకులు, కార్యకర్తలు బాహాబాహీకి దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. ఇటీవల పార్టీలో చేరిన ఎన్‌ఆర్‌ఐ కంది శ్రీనివాసరెడ్డి రాకను వ్యతిరేకిస్తూ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, పార్టీ సీనియర్ నేత గండ్రత్ సుజాత వర్గీయులు గేటుకు తాళం వేసి అడ్డుకున్నారు. ఈ క్రమంలో తన వర్గీయులు గేటు దూకి తాళాన్ని పగులకొట్టగా.. శ్రీనివాసరెడ్డి బౌన్సర్లతో కలిసి లోపలికి వెళ్లారు. సభాహాలులోకి వస్తుండగా మరోసారి సుజాత, సాజిద్‌ఖాన్ వర్గీయులు గేటు మూసివేయడంతో శ్రీనివాసరెడ్డి వర్గీయులు తోసుకుని లోపలకు వెళ్లారు. తమ నాయకుడిని వేదికపైకి పిలువాలంటూ వీహెచ్‌తో వాగ్వాదానికి దిగారు. బెంచీలను గట్టిగా చరుస్తూ నినదించారు. మరోవర్గం కార్యకర్తలు వారిని అడ్డుకునే యత్నం చేయగా ఇరువర్గాల అరుపులు, కేకలతో అక్కడ ఏం జరుగుతుందో తెలియని గందోరగోళ పరిస్థితి. ఈ క్రమంలో వీహెచ్ శ్రీనివాస రెడ్డిని వేదికపైగా పిలువగా వచ్చి కూర్చున్నారు. అయినా ఇరువర్గాల మధ్య ఘర్షణ తగ్గలేదు. ఓ క్రమంలో నేతలపై దాడిచేసినంత పనిచేశారు. వీహెచ్ మెడలోని కండువాను శ్రీనివాసరెడ్డి వర్గీయుడు లాక్కోవడం ఉద్రిక్తతకు కారణమైంది. ఈ క్రమంలో వీహెచ్ వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వినకుండా ఆందోళన కొనసాగించడంతో చేసేదిలేక వీహెచ్‌తో సహా నేతలంతా బయటకు వెళ్లిపోయారు. కొద్దిసేపు అక్కడే వేచి చూసిన శ్రీనివాసరెడ్డి తన వర్గీయులతో కలిసి బయటకు వెళ్లారు. కాగా వీహెచ్‌కు వ్యతిరేకంగా ఆయన వర్గీయులు నినాదాలు చేశారు. 15 నిమిషాల తర్వాత తిరిగి సభ ప్రారంభం కాగా వీహెచ్ ప్రసంగించారు.

సీఆర్ఆర్‌కు నివాళి

ఇటీవల అనారోగ్యంతో మరణించిన మాజీ మంత్రి సి.రాంచంద్రారెడ్డికి మాజీ ఎంపీ వి.హనుమంతరావు నివాళులర్పించారు. శాంతినగర్‌లోని సీఆర్ఆర్ ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన వెంట ఏఐసీసీ సభ్యుడు డాక్టర్ నరేష్ జాదవ్ , డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, తదితరులు ఉన్నారు.



వీహెచ్‌తో వాగ్వాదానికి దిగిన కంది వర్గీయులు

కందిపై సస్పెన్షన్ వేటు

డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ మాట్లాడుతూ.. ఎన్‌ఆర్‌ఐ కంది శ్రీనివాస్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. బౌన్సర్లతో వచ్చి నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలపై దాడి చేయడంతో పలువురికి గాయాలయ్యాయని, వారు చికిత్స నిమిత్తం రిమ్స్‌లో చేరారన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ భావజాలం కలిగిన వ్యక్తికి కాంగ్రెస్ సంస్కృతి తెలియదన్నారు. పైసలున్నాయనే అహకారంతో సీనియర్లను సైతం లెక్కచేయకుండా వ్యవహరిస్తున్నారని, ఏదైనా కార్యక్రమానికి సంబంధించి పార్టీ సీనియర్ల ఫొటోలను సైతం ఫ్లెక్సీల్లో వేయడం లేదన్నారు. నాయకులను ఎల్లిగాడు.. మల్లిగాడంటూ వ్యాఖ్యానించడం ఆయన కుసంస్కృతికి అద్దం పడుతుందన్నారు. అనంతరం కందిని ఆరేళ్లపాటు సస్పెన్షన్ చేస్తున్నట్లుగా ఉత్తర్వులు జారీ చేశారు.

‘అడ్డుకోవడం దురదృష్టకరం..’

బీసీ ఐక్యవేదిక సభకు రాకుండా గేట్లకు తాళాలు వేసి తనను అడ్డుకోవడం దురదృష్టకరమని కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. పార్టీలోకి చొరబడ్డ కొన్ని సంఘ విద్రోహక శక్తుల కారణంగానే ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. బీసీల ఐక్యత కోసం గళమెత్తిన తనను లోపలికి రాకుండా అడ్డుకోవడం విచారకరమన్నారు. అయినా తామంతా కాంగ్రెస్ కుటుంబంగా ఒకే గొడుగు కింద పనిచేస్తామని, దీనిని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరంలేదన్నారు. విషయాన్ని అధిష్టానమే చూసుకుంటుందని, బీఆర్ఎస్‌ను గద్దె దించడం, జోగు రామన్నను ఓడించేందుకు తామంతా కలిసికట్టుగా పనిచేస్తామని స్పష్టం చేశారు.

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి

దేశవ్యాప్తంగా బీసీల గణనను నిర్వహించడంతో పాటు కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని వీహెచ్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. దీంతో బీసీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపుతో పాటు పిల్లల చదువులు, స్కాలర్ షిప్ అందేలా రిజర్వేషన్లు లభిస్తాయన్నారు. దేశంలో 52శాతం, రాష్ట్రంలో 54శాతం జనాభా కలిగిన బీసీలకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఐఐటీ, ఐఐఎం వంటి ఉన్నత సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కొన్ని బీసీ కులాలు ఇప్పటికీ అసెంబ్లీలో అడుగు పెట్టలేదన్నారు. అలాంటి వారికి బీసీ రిజర్వేషన్లు తోడ్పడనున్నాయన్నారు. రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని తిరిగి పునరుద్ధరించిన న్యాయవ్యవస్థకు సెల్యూట్ చేస్తున్నట్లుగా వెల్లడించారు. దేశంలో రాహుల్ హవా నడుస్తుందని కేంద్రంలో ఆయన ప్రధాని కావడంతో పాటు రాష్ట్రంలో కేసీఆర్‌ను గద్దెదించి కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. టికెట్ హైకమాండ్ నిర్ణయిస్తుందని అది ఖరారు కాకముందే బౌన్సర్లతో వచ్చి దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ సంస్కృతి కాదని కంది శ్రీనివాసరెడ్డిపై మండిపడ్డారు. అమెరికా నుంచి ప్రజాసేవ చేసేందుకు వచ్చిన వ్యక్తి అందరినీ కలుపుకుని పోవాలే తప్ప బౌన్సర్లతో ఇతర నేతలపై దాడులు చేయడమేంటని ఆయన ప్రశ్నించారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ప్రజావాణి అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన బాధితుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు.వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకుండా శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతోనే హక్కుల సాధన

కైలాస్‌నగర్/ఎదులాపురం: ఐక్య ఉద్యమాలతోనే కార్మిక హక్కుల సాధన సాధ్యమని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్, ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) జనరల్ బాడీ సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని రిమ్స్ బ్రాంచ్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. రిమ్స్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు సంబంధిత కృష్ణ కాంట్రాక్ట్ ఏజెన్సీ జీవో ప్రకారం వేతనాలు అందించడం లేదని ఆరోపించారు. అనంతరం రిమ్స్ బ్రాంచ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దుబ్బాక సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఓ.స్వామి, ఉపాధ్యక్షులుగా ముజీబ్, వెంకటేష్, రవి, సహాయ కార్యదర్శులుగా సైఫ్‌ఖాన్, ఇర్ఫాన్, శివ, ముఖ్య సలహాదారులుగా కుర్ర శంకర్ తదితరులుఎన్నికయ్యారు. ఇందులో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్‌కు 50శాతం రాయితీ

ఆదిలాబాద్: స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకొని ఆర్టీసీ బస్సుల్లో సీనియర్ సిటిజన్‌కు మంగళవారం రాయితీ కల్పిస్తున్నట్లు ఆదిలాబాద్ రీజనల్ మేనేజర్ సోలోమన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తిరిగే పల్లె వెలుగు సర్వీసుల్లో ప్రయాణించే వయోవృద్ధులకు టికెట్‌లో 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రయాణ సమయంలో ఆధార్ తప్పనిసరిగా వెంట తీసుకొని రావాలని తెలిపారు.

పంద్రాగస్టుకు సర్వం సిద్ధం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

- వేడుకలకు ముస్తాబైన పోలీస్ పరేడ్ మైదానం
- పతాకావిష్కరణ చేయనున్న విప్ గంప గోవర్ధన్

కైలాస్‌నగర్ : పంద్రాగస్టు వేడుకలకు జిల్లా సర్వం సిద్ధమైంది. పట్టణంలోని పోలీస్ పరేడ్ మైదానాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పోలీసుల కవాతు, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలకు వీలుగా మైదానాన్ని రంగువల్లులతో తీర్చిదిద్దారు. అతిథులు, ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, అధికారులు కూర్చునేందుకు వీలుగా ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి తెలియజేసేలా స్టాళ్ల ఏర్పాటుతో పాటు శకటాలను ప్రదర్శించనున్నారు. ఉదయం 11గంటలకు నిర్వహించనున్న వేడుకలకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం పోలీసుల నుంచి ఆయన గౌరవవందనాన్ని స్వీకరిస్తారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందజేయనున్నారు. ఏర్పాట్లను కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.



సిద్ధమైన పోలీస్ పరేడ్ మైదానంలోని వేదిక



మైదాన ఆవరణను తీర్చిదిద్దారిలా..

అధినేత మదిలో ఎవరో!

- సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో టికెట్లపై ఉత్కంఠ
- పలు చోట్ల మార్పులంటూ ప్రచారం
- బీఆర్ఎస్‌లో పెరుగుతున్న ఆశావహులు
- ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల మార్పు ఖాయం?



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గులాబీ అధినేత, సీఎం కేసీఆర్ మదిలో ఎవరెవరు ఉన్నారోనని సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో ఉత్కంఠ నెలకొంది. పార్టీ అభ్యర్థుల ఎంపిక కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో పలు అంశాలు తెరపైకి వస్తుండడం చర్చనీయాంశంగా మారుతోంది. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు సూచనప్రాయంగా తమకే టికెట్లు ఖరారైనట్లు చెప్పుకుంటున్నారు. కానీ ఇప్పటికీ అధికారికంగా జాబితా వెల్లడి కాలేదు. ఈ నెలలోనే మొదటిదఫా 70 వరకు స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తారని పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది అసెంబ్లీ స్థానా ల్లోనూ అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తే ఇప్పుడున్న ఎమ్మెల్యేలందరికీ టికెట్లు వస్తాయా..? లేక ఏయే స్థానాల్లో మార్పులు ఉంటాయా.. అనే తర్జన భర్జన నడుస్తోంది. మెజార్టీ స్థానాల్లో పాత వారికే మళ్లీ టికెట్లు ఇస్తామని అప్పట్లో సీఎం ప్రకటించారు. ఎక్కడైనా ఎమ్మెల్యేలు సర్వేలో గ్రాఫ్ పడిపోవడం, ప్రజల నుంచి వ్యతిరేకత, ప్రత్యర్థి కంటే వెనుకబడిపోవడం వంటి కారణాలను పరిగణనలోకి తీసుకుని మార్పులు చేస్తామని పేర్కొన్నారు. ఆయా స్థానాల్లో కొత్తవారికి అవకాశాలు ఉంటాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మెజార్టీ స్థానాల్లో ఒకే..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గత ఎన్నికల్లో పది స్థానాల్లో ఆసిఫాబాద్ మినహా అన్ని చోట్ల బీఆర్ఎస్ జెండా ఎగురవేసింది. ఆ తర్వాత ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సైతం పార్టీ మారడంతో ఉమ్మడి జిల్లాలో తిరుగులేని శక్తిగా ఎదిగింది. కొన్ని చోట్ల రెండో స్థానంలో నిలిచిన కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ బలపడడంతో అభ్యర్థుల ఎంపిక కీలకంగా మారింది. గెలుపు గుర్రాలకే టికెట్లు ఇచ్చి ఎలాగైనా మూడోసారి అధికారంలోకి రావాలని చూస్తున్న గులాబీ బాస్‌కు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వ్యతిరేకత ఉన్న వారి విషయంలో మాత్రం మార్పు ఖాయంగా వినిపిస్తోంది.

చివరి వరకు టెన్షన్ ?

మార్పులు చేసే చోట్ల ఎటూ తేల్చకుండా నాన్చుడు ధోరణి ఉంటే ఆ ఎమ్మెల్యేలకు చివరి క్షణం వరకు టెన్షన్ తప్పేలా లేదు. మొదటి జాబితాలో ఉన్న వారు ఉత్సాహంగా ప్రచారంలోకి దిగితే సీట్లు మార్చే చోట అందుకు భిన్నంగా ఉండనుంది. ‘ఒక వేళ ఈలోపు రాష్ట్ర, జిల్లా సమీకరణలు మారితే అందరికీ టికెట్లు వచ్చినా ఆశ్చర్యం లేదు’ అని సీనియర్ నాయకుడు ఒకరు అభిప్రాయం వ్యక్తం చేశారు. అభ్యర్థులను మార్చితే అందుకు తగిన వారుంటేనే పార్టీకి లాభం లేకపోతే ఇతరులు లబ్ధి పొందే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో అధినేత మనసులో ఏముందోనని జాబితా వెలువడే వరకు పార్టీ శ్రేణుల్లో చర్చ మాత్రం జోరుగా సాగుతోంది.

ఆశావహుల ఆరాటం

ఎక్కడైనా సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చితే తమను పరిశీలనలోకి తీసుకోవాలని బీఆర్ఎస్‌లోనే అనేక మంది బీ ఫామ్ కోసం వరుసలో ఉన్నారు. అధిష్టానం దృష్టిలో పడేందుకు, ప్రజల్లో తమ బలం పెంచుకునేందుకు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిత్యం నియోజకవర్గాల్లో తిరుగుతున్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి తామే ఎమ్మెల్యే అభ్యర్థులం అన్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నారు.

ఎక్కడెక్కడ మార్పు?

ఉమ్మడి జిల్లాలో ఆరు నుంచి ఏడు అసెంబ్లీ స్థానాల్లో దాదాపు పాత వారికే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఇందులో సిర్పూర్, ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, ముథోల్, చెన్నూరులో అభ్యర్థులకు ఢోకా లేనట్లు ప్రచారం జరుగుతోంది. మంచిర్యాల, బెల్లంపల్లి, ఖానాపూర్, బోథ్ స్థానాలపై ఊగిసలాట కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఈ స్థానాల్లో మార్పులు ఉంటాయా? కొత్త వారికి అవకాశాలు ఉంటాయా ? అనేది తేలాల్సి ఉంది.

క్లుప్తంగా

ఆటో బోల్తా.. ఒకరు మృతి


హరీశ్ (ఫైల్)

తలమడుగు: ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడి ఒకరు మృతి చెందాడు. ఎస్సై ధనశ్రీ కథనం ప్రకారం.. మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన గోనెల హరీశ్ (17) కొత్తూరు నుంచి ఆటోలో సోమవారం స్వగ్రామానికి వస్తున్నాడు. భీమన్న వాగు సమీపంలో ప్రమాదవశాత్తు ఆటోబోల్తా పడింది. ఈ ప్రమాదంలో హరీశ్ మీద ఆటో పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో ఎస్సై ధనశ్రీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా రైతు మృతి

తాంసి: చేనులో పనికి వెళ్లిన రైతు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన భీంపూర్ మండలం నిపాని గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. శాతెల్లి స్వామి(38) సోమవారం గుట్ట ప్రాంత సమీపంలోని పంటచేనులో పనికి వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు అక్కడికి వెళ్లారు. చేనులో విగతజీవిగా పడి ఉన్నాడు. గ్రామస్తుల సమాచారంతో భీంపూర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా మృతుడికి గతకొంత కాలంగా ఫిట్స్(మూర్ఛవ్యాధి) వస్తుంది. చేనులో ఫిట్స్ వచ్చి చనిపోయాడా, లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా స్పష్టత లేదు. భీంపూర్ ఎస్సై లాల్‌సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హనుమన్ మందిరంలో శాంతి పూజలు


హోమం చేస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: మండలంలోని డోంగర్‌గామ్ గ్రామ పొలిమేరలో హనుమన్ మందిరంలో గ్రామస్తులు శాంతి పూజలు నిర్వహించారు. గత 45 రోజుల క్రితం ప్రజాప్రతినిధులు గ్రామస్తులను అడిగి హనుమాన్ విగ్రహానికి సంబంధించిన వెండి కళ్లు తీసుకెళ్లారు. దాంతో గ్రామ పెద్దలు కంటి చూపు కోల్పోతున్నారని ఆదివాసీలు భయాందోళనకు గురవుతున్నారు. సిర్పూర్(యూ) మండలం జిర్లఘాట్‌కు చెందిన కుమ్ర దేవ్‌రావ్ మహారాజ్ ఆధ్వర్యంలో సోమవారం హోమం, అభిషేకం పూజలు చేశారు. గ్రామ పటేల్ పెందోర్ బాదు, భీంజితాండ పటేల్ హచ్చునాయక్, సర్పంచ్ రాథోడ్ రాంచందర్‌నాయక్, గ్రామ పెద్దలు కోవ భీంరావ్, పెందోర్ లింబారావ్, జాదవ్ లింబాజీ ఉన్నారు.

గెస్ట్ లెక్చరర్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రభుజ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. కామర్స్ పోస్టు ఖాళీగా ఉందని, అర్హులైన అభ్యర్థులు దరఖాస్తుతోపాటు సంబంధిత విద్యార్హత పత్రాలు తీసుకుని ఈనెల 16న కళాశాలలో సమర్పించాలని సూచించారు. రాత పరీక్ష డెమో ద్వారా ఎంపిక విధానం ఉంటుందని తెలిపారు. అదేరోజు ఫస్టియర్‌లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఈనెల 16న కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

సైనికుడా.. వందనం

దేశ రక్షణ, భారత భూభాగాన్ని కంటికి రెప్పలా కాపాడుతూ, పొరుగు నుంచి దురాక్రమణలను అడ్డుకోవడంలో వీర సైనికుల పాత్ర కీలకం. కుటుంబాలను వదిలి దేశ రక్షణలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. పంద్రాగస్టు సందర్భంగా ఉమ్మడి జిల్లాలో పలువురి సైనికులపై సాక్షి ప్రత్యేక కథనం.

- దేశసేవలో జవాన్లు
- రక్షణలో భాగస్వాములవుతూ..
- యువతకు ఆదర్శం

బోథ్: జవాన్ అంటే ఉద్యోగం కాదని దేశ సేవ చేయడమేనని నిరూపిస్తున్నారు బోథ్‌కు చెందిన జవాన్లు. మండల కేంద్రం నుంచి దాదాపు 181 మంది జవాన్లు ఉన్నారు. వివిధ హోదాల్లో వీరు సేవలందిస్తున్నారు. రాబోయే రోజుల్లో అకాడమీ ఏర్పాటుకు పలువరు సైనికులు సన్నాహాలు చేస్తున్నారు. స్థానిక యువతకు సైనికులు ఆదర్శంగా నిలుస్తున్నారు. కాగా బోథ్ మండలానికి చెందిన యువత జవాన్‌గా మారడానికి సన్నద్ధమవుతున్నారు.

వీర మరణం పొందిన సతీశ్‌గౌడ్



బోథ్ మండలం మర్లపెల్లికి చెందిన లింగాగౌడ్ కుమారుడు గౌడిసెల సతీశ్‌గౌడ్ సీఆర్పీఎఫ్‌లో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 2016లో గడ్చిరోలి, చత్తీస్‌ఘడ్ సరిహద్దు ప్రాంతంలో మావోలు, సీఆర్పీఎఫ్ బలగాలకు మధ్య జరిగిన కాల్పుల్లో సతీశ్‌గౌడ్ మృతిచెందారు. ఆయన స్వస్థలం మర్లపెల్లిలో ఆయన జ్ఞాపకార్థం విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రతిఏటా ఆయన వర్ధంతిని గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తారు.



మర్లపెల్లిలో ఏర్పాటు చేసిన సతీశ్‌గౌడ్ విగ్రహం

ఒకే కుటుంబం నుంచి ఏడుగురు సైనికులు..
బోథ్‌లోని కదం భోజారామ్, ముకుంద్, శంకర్, నర్సింగ్‌రావులు అన్నదమ్ములు. దివంగత భోజారామ్‌కు ఐదుగురు కుమారుల్లో ప్రవీణ్ కుమార్, ప్రతాప్ సైనికులు. ముకుంద్‌కు ముగ్గురు కుమారుల్లో ఇద్దరు సైనికులే. పెద్దకుమారుడు సుధాకర్ సైనికుడిగా సేవలందించి ఇటీవల రిటైర్డ్ అయ్యాడు. రెండో కుమారుడు మధుకర్ సైనికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. శంకర్ కుమారుడు ప్రశాంత్, కదం నర్సింగ్‌రావు కుమారుడు విజయ్ సైనికులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఒకే కుటుంబం నుంచి ఏడుగురు జవాన్లుగా దేశ రక్షణ కోసం పాటుపడుతున్నారు.

దేశసేవ చేయడం గర్వకారణం



2006లో 21 ఏళ్ల ఉన్నప్పుడు ఆర్మీలో సెలెక్ట్ అయ్యాను. సైనికుడిగా దేశ సేవ చేయడం ఆనందంగా భావిస్తున్నాను. మరో మూడు నెలల్లో నేను రిటైర్డ్ కాబోతున్నాను. 17 ఏళ్ల పాటు ఆర్మీలో ఉండి విధులు నిర్వహించాను. దేశ సేవ చేయడం గర్వంగా భావిస్తున్నాను. దేశ రక్షణలో సైనికుడిని విధులు నిర్వహించడం సంతోషంగా ఉంది.

– మల్లెపూల మహేంధర్, సైనికుడు, బోథ్

దేశ రక్షణలో నేను సైతం



దేశ రక్షణలో నేను పాలుపంచుకోవడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం పాకిస్తాన్ బార్డర్‌లో విధులు నిర్వహిస్తున్నాను. భారత ప్రజల దీవనలే మాకు బలం. జవాన్‌గా ఉండటం గర్వకారణంగా ఉంది. యువత దేశ సేవ చేయడానికి ముందుకు రావాలి.

– నీలి రాము, సైనికుడు, బోథ్

ఇంటర్‌లోనే సైన్యంలో చేరా



నిర్మల్‌ఖిల్లా: ఇంటర్ చదివే సమయంలోనే సైన్యంలో చేరాను. 1993 నుంచి 2013 వరకు 20 ఏళ్ల పాటు సైన్యంలో పనిచేసి హవల్దార్‌గా రిటైర్ అయ్యాను. జమ్మూకశ్మీర్, అస్సాం, శ్రీలంక తదితర సరిహద్దు ప్రాంతాల్లో ఎన్ఎస్‌జీ కమాండర్‌గా విధులు నిర్వహించాను. బాంబు డిస్పోజల్ స్క్వాడ్ దళంలో పనిచేశా. పార్లమెంటుపై జరిపిన దాడిలో తీవ్రవాదులను పట్టుకున్న బృందంలో సభ్యుడిని.

– కొండాపురం ప్రభాకర్, నిర్మల్

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్


అర్జీలు స్వీకరిస్తున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల అర్జీలను సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. శాఖలవారీగా అర్జీలను పరిశీలించి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో కనక భీంరావు, ఏడీ ఎంఅండ్‌హెచ్‌ఓ కుమ్ర బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌ఓ సందీప్, ఆర్సీవో గంగాధర్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ మేనేజర్ లింగు, అధికారులు పాల్గొన్నారు.

- మేకల కోసం రుణం ఇప్పించాలని బజార్‌హత్నూర్ మండలం కొత్తగూడకు చెందిన మొత్కర్ సావిత్రిబాయి అర్జీ సమర్పించింది.
- ఉట్నూర్ మండలం రాజుగూడకు రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్తులు విన్నవించారు.
- తనకు ఎడ్ల జత ఇప్పించాలని జైనూర్ మండలం జెండగూడ గ్రామానికి చెందిన లచ్చు కోరాడు.
- తనకు బోర్‌వెల్, త్రీఫేజ్ విద్యుత్ మంజూరు చేయాలని దండేపల్లి మండలం చెక్‌డ్యాంగూడ గ్రామానికి చెందిన సోయం శకుంతల అర్జీ అందించింది.
- తనకు ఆర్థికసాయం అందించాలని జన్నారం మండలం బంగారితండా గ్రామానికి చెందిన బోడ అరవింద్ విన్నవించాడు.

తాగునీరు కలుషితం..విద్యార్థులకు అస్వస్థత


చికిత్స పొందుతున్న విద్యార్థులు

ఉట్నూర్‌రూరల్: కలుషిత నీరు తాగి 14 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. వసతి గృహంలో మొత్తం 110 మంది విద్యార్థులు ఉన్నారు. సోమవారం కలుషిత నీరు తాగి 14 మంది అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నలుగురు విద్యార్థులను తల్లిదండ్రులు ఆదిలాబాద్‌లో చేర్పించారు. వసతి గృహంలో ఆర్‌ఓ ప్లాంటు ఉన్నా అది వినియోగంలో లేక మూలనపడి ఉండగా అత్యవసర సమయంలో విద్యార్థులు చేతి పంపు నీళ్లు తాగి అస్వస్థతకు గురయ్యారని తల్లిదండ్రులు వాపోయారు. 5,6,7,8,9 తరగతులు విద్యార్థులు పరమేశ్వర్, పవన్, లక్ష్మణ్, రామేశ్వర్, స్వప్నిల్, నికేశ్, అరవింద్, నైతిక్, కరన్, యోగేశ్‌లు వాంతులు, విరేచనాలు చేసుకున్నారు. వారిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ జైవంత్‌ఆరవు, డీడీ సునీత విద్యార్థులను పరామర్శించారు.

కల్తీ కల్లు తాగి ఒకరు మృతి


ముత్యం (ఫైల్)

లక్ష్మణచాంద: కల్తీ కల్లు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. బాసర మండలం ఓని గ్రామానికి దుమ్మడోల్లు ముత్యం (32) తాపిమేస్త్రీగా పనిచేసేందుకు లక్ష్మణచాంద మండల కేంద్రానికి చెందిన చంద్రయ్య మేస్త్రీ వద్దకు మూడు రోజుల క్రితం వచ్చాడు. ఆదివారం పని ముగించుకుని ఇంటికి వచ్చిన తర్వాత రాత్రి తన స్నేహితులు గణేశ్, గంగాధర్‌తో కలిసి దషగౌడ్‌కు చెందిన తెల్ల కల్లు దుకాణంలో కల్లు తాగారు. తాగిన వెంటనే ముత్యం అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గణేశ్, గంగాధర్ వెంటనే ముత్యంను మేస్త్రీ చంద్రయ్య ఇంటికి తీసుకెళ్లారు. ఎక్కడ కల్లు తాగారో అక్కడికే వెళ్లాలని అనడంతో దుకాణం వద్దకు తీసుకెళ్లారు. నిర్వాహకులు గమనించి అతన్ని తీసుకెళ్లాలనడంతో అక్కడ నుంచి రోడ్డుపై ఉంచారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. గణేశ్, గంగాధర్, చంద్రయ్య, అపస్మారక స్థితిలో ఉన్న ముత్యంను నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ముత్యంను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భర్త మృతి విషయం తెలుసుకున్న భార్య జయశీల కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం లక్ష్మణచాందకు వచ్చింది. అధిక మోతాదులో కల్లు తాగడంతో మృతి చెందాడనే అనుమానం వ్యక్తం చేసింది. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు లక్ష్మి(4), కల్యాణి (7), శివాని (3) ఉన్నారు.

చెట్టుకు కారు ఢీ


గాయపడిన సంజీవ్‌గౌడ్, సుజాత, సంధ్యారాణి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెస్లీనగర్ తండా సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిర్మల్‌కు చెందిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం.. నారగోని సంజీవ్‌గౌడ్ తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో హైదరాబాద్ నుంచి నిర్మల్‌కు వెళ్తున్నారు. వెస్లీనగర్ తండా వద్దకు రాగానే కారు అదుపు తప్పి రహదారి కిందకు దిగిపోయి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాలుగేళ్ల పాపతో పాటు కారులో ఉన్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో సంజీవ్ గౌడ్, అతని భార్య సుజాత, కూతురు సంధ్యారాణి (పంచాయతీ కార్యదర్శి), మనుమరాలు వేద కృతిక ఉన్నారు. బాలిక పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏజెన్సీ టు ఎర్రకోటకు

- గిరిజన దంపతులకు అరుదైన గౌరవం
- పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానం

నార్నూర్: దేశరాజధాని న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద మంగళవారం నిర్వహించే పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొనాలని గిరి దంపతులకు కేంద్రం ఆహ్వానం అందించింది. మండలంలోని గుండాల గొండుగూడ గ్రామానికి చెందిన జుగ్నాక గణపతిరావు, కమల దంపతులకు అరుదైన గౌరవం దక్కింది. ఈ వేడుకల్లో పాల్గొనడం, ప్రధాని మోదీతో మాట్లాడే అవకాశం పొందడంపై వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. దంపతుల సేవలు గుర్తించి కేంద్రం అజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా వారిని ఆహ్వానించడంపై గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుండాల గొండుగూడ నుంచి..
గుండాల గొండుగూడకు చెందిన జుగ్నాక గణపతిరావు, కమల దంపుతులు సాధారణ రైతులు. వారికి ఉన్న మూడెకరాల్లో వ్యవసాయం చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. వ్యవసాయంలో తమతోపాటు తోటి రైతుల కష్టాలు ఎదుర్కొంటున్నారని గుర్తించారు. రైతు ఉత్పత్తిదారులుగా మారితే తప్పా వ్యవసాయం లాభసాటిగా మారదని నిర్ణయించుకున్నారు. 22 జూలై 2001లో 'భూసంపద రైతు ఉత్పత్తిదారుల సంఘం' ఏర్పాటు చేశారు. 10 మంది రైతుల సభ్యులతో ప్రారంభమై చుట్టూ గ్రామాల రైతులు ఇందులో చేరడంతో వీరి సంఖ్య 350కు చేరింది. చైర్మన్‌గా గణపతిరావు మిగతా రైతులతో కలిసి బోర్డును ఏర్పాటు చేసుకున్నారు. వారికి ఉపయోగకరమైన కార్యక్రమాలు చేయడంతో కేంద్ర ప్రభుత్వ దృష్టిని ఆకర్షించారు.


జుగ్నాక గణపతిరావు, కమల దంపతులు

కేంద్ర ప్రభుత్వం..నాబార్డు సంస్థ అండ..
'భూ సంపద రైతు ఉత్పత్తిదారుల సంఘం' ద్వారా రైతులకు అందిస్తున్న సేవ కార్యక్రమాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం, నాబార్డు సంస్థ వారికి అండగా నిలిచింది. మండల కేంద్రంలో ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సిబ్బందిని నియమించి సంఘానికి కావల్సిన ఆధునిక పనిముట్లు, ఎరువులు, విత్తనాలు, టార్పాలిన్ కవర్లు, వ్యవసాయానికి కావల్సిన పెట్టుబడి రుణాలు అందించారు. వ్యవసాయ శాఖ నుంచి మూడు అనుమతి లైసెన్స్‌లు పొందారు. దీంతో పంట ఉత్పత్తిదారులుగా మారాలనే గణపతిరావు, కమల దంపతుల కృషి ఫలించింది.

లక్ష్యంతో పని చేశాం

ఏజెన్సీ ప్రాంతంలోని రైతుల కష్టాలను గుర్తించాం. సరైన సహకారం లేకపోవడంతో గిరిజనులు దళారుల చేతిలో మోసపోతూనే ఉన్నారు. రైతులు ఉత్పత్తిదారులుగా మారాలనే ఉద్దేశంతో 'భూసంపద రైతు ఉత్పత్తిదారుల సంఘం' ఏర్పాటు చేశాం. నేను చైర్మన్‌గా అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేయగలిగాను. వచ్చే ఏడాది నుంచి రైతులకు సంఘం ద్వారా మరింత మెరుగైన సేవలందించడానికి కృషి చేస్తాం. కేంద్రం గుర్తించి పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొనేందుకు అవకాశం రావడం ఆనందంగా ఉంది.

– జుగ్నాక గణపతిరావు, కమల దంపతులు


తండ్రి మందలించాడని కుమారుడి ఆత్మహత్య

- పాఠశాలకు వెళ్లకుండా ఇంటికి వచ్చాడని అన్నందుకు అఘాయిత్యం
- రాజుల్‌కోరిలో ఘటన


అనురాగ్(ఫైల్)

తాంసి: పాఠశాలకు వెళ్లకుండా ఇంటికి ఎందుకు వచ్చావని తండ్రి మందలించడంతో కుమారుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భీంపూర్ మండలంలోని రాజుల్‌కోరి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సిడాం అనురాగ్(13) అందర్‌బంద్ గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 4న ఉపాధ్యాయులకు తెలియకుండా ఇంటికి వెళ్లాడు. తిరిగి పాఠశాలకు వెళ్లాలని తండ్రి సీతారాం చెప్పినా వెళ్లలేదు. పంద్రాగస్టు వేడుకలు ఉన్నందున వెళ్లాలని శనివారం మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన అనురాగ్ ఇంటి వద్ద పురుగుల మందు తాగి కుటుంబసభ్యులకు చెప్పాడు. వెంటనే ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఎస్సై లాల్‌సింగ్‌నాయక్ మృతదేహాన్ని పరిశీలించారు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులు అప్పగించారు. గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఐటీడీఏ ఏపీవో భాస్కర్, ఏటీడీవో నిహారిక రాజుల్‌కోరిలో కుటుంబసభ్యులను పరామర్శించారు. విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని హెచ్‌ఎం రాజశేఖర్‌ను ఆదేశించారు.

ఉరివేసుకుని ఒకరు బలవన్మరణం


చంద్రశేఖర్(ఫైల్)

తలమడుగు: ఉరివేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ధనశ్రీ కథనం ప్రకారం.. మండలంలోని ఉండం గ్రామానికి చెందిన కల్లూరి చంద్రశేఖర్ (36), నవ్య భార్యాభర్తలు, వీరికి కుమార్తె అక్షయ, కుమారుడు శ్రీకర్ ఉన్నారు. చంద్రశేఖర్ వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గతేడాది భార్య నవ్య రైలు ప్రమాదంలో చనిపోయింది. అప్పటి నుంచి చంద్రశేఖర్ మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపంతో సోమవారం ఇంట్లో ఎవరి లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు

లక్ష్మణచాంద: మద్యానికి బానిసై ఒకరు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని రాచాపూర్‌కు నిలాయిపేట్ వెంగన్న(52) గత కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఉదయం మద్యం మత్తులో గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటువైపు వెళ్లిన గ్రామస్తులు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

సోన్: మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై సంతోషం రవీందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గుజ్జుల్‌వార్ రతన్ (37) తండ్రి అశోక్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం నిర్మల్ ఆస్పత్రిలో ఆడ్మిట్ చేశాడు. రతన్ ఇంటికి తాళం వేసి ఆస్పత్రికి వెళ్లాడు. శనివారం ఇంటికి తిరిగివచ్చాడు. తాళం వేసి మళ్లీ వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం రతన్ అత్తమ్మ ఫోన్ చేసి ఇంటి తాళం వేయలేదని చెప్పడంతో వెంటనే వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించాడు. కప్‌బోర్డ్‌లో దాచిన నాలుగు తులాల బంగారం ఆభరణం, రూ.90 వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.